క్లుప్తంగా

వేగవంతంగా సరిహద్దు రాళ్ల ఏర్పాటు

పాలకొండ రూరల్: మండల వ్యాప్తంగా సమగ్ర భూసర్వే ప్రాప్తికి భూ సరిహద్దు రాళ్ల ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. గురువారం రుద్రిపేట గ్రామంలో రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సర్వేయర్ శరత్‌కుమార్, వీఆర్వో బి.చిన్నందొర, దుర్గాప్రసాద్‌ల నేతృత్వంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ నెలాఖరు నాటికి మండల పరిధిలో రాళ్ల ఏర్పాటు పూర్తి చేయటం జరుగుతుందన్నారు. జిల్లా ఏరువాక సలహామండలి సభ్యులు కండాపు ప్రసాదరావు, వలంటీరు ప్రసాద్ తదితరులు ఈ కార్యక్రమానికి సహకరించారు.

నిబంధనలు పాటించాలి


వాహన తనిఖీలు చేస్తున్న సీఐ

పాలకొండ రూరల్: వాహన చోదకులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనులు పాటించాలని, మైనర్లకు వాహనాలు నడిపేందుకు ఇవ్వటం చట్టరీత్యా నేరమని పాలకొండ సీఐ మురళీధర్ అన్నారు. శ్రీకాకుళం రహదారి, వైఎస్సార్ కూడలి వద్ద వాహన తనిఖీలు గురువారం చేపట్టారు. అధికలోడు, మితిమీరిన వేగంతో వస్తున్న వాహనాలతో పాటు సరైన ధ్రువపత్రాలు, డ్రైవింగ్ లైసెన్సులు లేకుండా వాహనాలు నడుపుతున్న వారిని గుర్తించి అపరాధ రుసుం విధించారు. ఆయన వెంట ఎస్‌ఐ బి.శివప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక స్పందన


ప్రత్యేక స్పందన నిర్వహిస్తున్న సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్

సీతంపేట: భూ సమస్య పరిష్కారానికి స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో పాలకొండ సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్ ప్రత్యేక స్పందన గురువారం నిర్వహించారు. మూడు భూ వివాదాలకు సంబంధించిన కేసులు పరిష్కారానికి ఇరువర్గాలతో మాట్లాడారు. క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.నరసింహమూర్తి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రం తనిఖీ


పరీక్ష కేంద్రంలో విద్యార్థుల హాజరు పరిశీలిస్తున్న ఎంపీడీఓ అప్పారావు

కొమరాడ: సచివాలయంలో పనిచేస్తున్న సిబ్బంది ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ ఎల్వీ అప్పారావు అన్నారు. కొమరాడలో బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల పరీక్ష కేంద్రాన్ని, గుమడ సచివాలయాలను ఆయన గురువారం సందర్శించారు. పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు ఉన్న సౌకర్యాలు, హాజరు తదితర అంశాలపై ఆరా తీశారు. సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతూ రికార్డులు తప్పనిసరిగా ఉండాలన్నారు. సమయపాలన పాటించాలని సూచించారు. ప్రిన్సిపాల్ రజని తదితరులు ఉన్నారు.

టెన్త్ పరీక్ష కేంద్రం పరిశీలన

సీతంపేట: మండలంలోని దోనుబాయిలోని టెన్త్ పరీక్ష కేంద్రాన్ని పాలకొండ సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పరీక్షలు రాస్తున్న తీరును తెలుసుకున్నారు. పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు.

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా శ్రీవరం


విధుల్లో చేరిన శ్రీవరం

గుమ్మలక్ష్మీపురం: ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ టి.శ్రీవరం ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ ప్రిన్సిపాల్‌గా పని చేసిన డాక్టర్ ఎం.వేణుగోపాల్‌కు నెల్లూరు జిల్లా ప్రభుత్వ బీఈడీ కళాశాలకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో శ్రీవరం నియమితులయ్యారు. విధుల్లో చేరిన ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తానన్నారు.

విశ్రాంత ఆర్మీ ఉద్యోగి శ్రమదానం


గుమ్మడి గెడ్డలో పేరుకు పోయిన చెత్త తొలగిస్తున్న మహేష్

కొమరాడ: ఇటీవల కురిసిన వర్షాలకు మాదలింగి గ్రామం గుండా ప్రవహించే గుమ్మడిగెడ్డలో చెత్త పేరుకుపోగా గ్రామానికి చెందిన విశ్రాంత ఆర్మీ ఉద్యోగి శిష్టు మహేష్ శ్రమదానంతో పూడిక తీతలు తీశాడు. చెత్తను తొలగించాడు. స్థానికులు పలువురు సహకరించారు. మహేష్‌ను పలువురు అభినందించారు.


పాలకొండ రూరల్: లుంబూరు ప్రజలకు సంక్షేమ లబ్ధిపై వివరిస్తున్న సర్పంచ్, వైస్ ఎంపీపీలు


సీతంపేట: రాజన్నగూడలో జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు ఎస్.లక్ష్మి ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం

ఉత్సాహంగా 'జగనన్నే మా భవిష్యత్తు'

జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంగా ఉత్సాహంగా సాగుతోంది. పార్టీ శ్రేణులతో పాటు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి కార్యక్రమంలో భాగస్వాములవుతున్నారు. తమ ఇళ్లకు స్టిక్కర్లు అతికిస్తున్నారు. తమ భవిష్యత్తు జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే బాగుందని చెబుతున్నారు.

– సాక్షి నెట్‌వర్క్


జియ్యమ్మవలస: చినమేరంగిలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు తదితరులు


పాలకొండ: పట్టణంలోని 15వ వార్డు పరిధిలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో పాల్గొన్న కన్వీనర్లు, ప్రజలు


పాలకొండ: జగనన్నే మా భవిష్యత్తు అంటూ స్టిక్కర్లు చూపిస్తున్న లబ్ధిదారులు


వీరఘట్టం: సంత-నర్సిపురంలో జగనన్నే మా భవిష్యత్తు కరపత్రాలను అందజేస్తున్న పీఏసీఎస్ అధ్యక్షుడు కర్రి గోవిందరావు తదితరులు


కొమరాడ: స్వామినాయుడువలసలో పార్టీ కన్వీనర్ డి.జనార్దనరావు ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం


కురుపాం: మొండెంఖల్ గ్రామంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ శ్రేణులు


భామిని: బత్తిలిలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో ఎంపీటీసీ టింగ అన్నాజీరావు, కోఆప్షన్ సభ్యులు విశ్వనాథ పట్నాయిక్ తదితరులు

సేంద్రియ ఎరువులతో అధిక వ్యవసాయ ఉత్పత్తులు

గరుగుబిల్లి: చెత్త నుండి సేంద్రియ ఎరువులను తయారు చేసుకొని ఆరోగ్యకరమైన వ్యవసాయ ఉత్పత్తులను తయారు చేయాలని ఈఓపీఆర్‌డీ ఎల్.గోపాలరావు అన్నారు. మండలంలోని సంతోషపురం ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా చెత్త నుండి ఎరువుల తయారీ విధానాన్ని పరిశీలించారు. అనంతరం డంపింగ్ యార్డు పరిసరాల్లో మొక్కలను నాటారు. సేంద్రియ ఎరువును వినియోగించి ఆరోగ్యకరమైన పంటలను పండించేలా రైతులకు మరింత అవగాహన కల్పించాల్సి వుందన్నారు. ఆయనతో పాటు సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే కళావతికి పరామర్శ


ఎమ్మెల్యే కళావతి, కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్‌రాజు, ఎమ్మెల్యే పుష్ప శ్రీవాణి

వీరఘట్టం: ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి సోదరుడు లక్ష్మణరావు మృతి చెందడంతో ఆమెను పార్వతీపురం మన్యం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి గురువారం పరామర్శించారు. వండవ గ్రామానికి వచ్చి వండవదొర కుటుంబంతో తమకున్న అనుబంధాలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఖమ్మం జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్యదొర కూడా ఎమ్మెల్యే కళావతిని పరామర్శించారు. లక్ష్మణరావు చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

గిరిజన ఉత్పత్తులకు మార్కెటింగ్ : పీఓ


స్టాల్స్ పరిశీలిస్తున్న పీఓ కల్పనాకుమారి

సీతంపేట: గిరిజనులు పండిస్తున్న అటవీ ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించనున్నట్టు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి అన్నారు. స్థానిక ఐటీడీఏలో జీసీసీ, వైకేపీ సిబ్బందితో గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఏఏ అటవీ ఉత్పత్తులు ఇక్కడ సేకరణ జరుగుతుందో అడిగి తెలుసుకున్నారు. వాటి క్రయవిక్రయాలపై చర్చించారు. అనంతరం పీఓ మాట్లాడుతూ వీడీవీకేల అభివృద్ధికి జీసీసీ, వైకేపీ సిబ్బంది సమన్వయంతో పని చేయాలన్నారు. విధుల్లో అలసత్వం వహించొద్దన్నారు. కార్యక్రమంలో జీసీసీ డీఎం సంధ్యారాణి తదితరులు ఉన్నారు.

చిరుధాన్యాల సాగుతో మేలు


రైతులకు సూచనలిస్తున్న ఉపకులపతి విష్ణువర్ధన్ రెడ్డి

- ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం కులపతి విష్ణువర్ధన్ రెడ్డి

సీతంపేట: చిరుధాన్యాల సాగును ప్రోత్సాహించాలని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. స్థానిక వ్యవసాయ పరిశోధనా స్థానాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఇక్కడ వేసిన పంటలను చూశారు. రైతులతో కొద్ది సేపు మాట్లాడారు. చిరుధాన్యాలతో రైతులకు మంచి ఆదాయ వనరులు సమకూరుతాయన్నారు. ప్రతీ గిరిజన రైతు ఈ పంటలను వేయాలన్నారు. వరి రకాలైన ఎంటీయూ 1064, ఎంటీయూ 1061 ఇక్కడ సాగు చేసి గిరిజన రైతులకు విత్తనాలను అందించాలన్నారు. వ్యవసాయ టూరిజాన్ని సైతం ప్రోత్సాహించాలన్నారు. నూతన వంగడాలను సృష్టించాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రామారావు, టెక్నికల్ సెక్రటరీ గురువారెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త పి.సీతారాం, ఎస్.లక్ష్మినారాయణ, పి.సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

కురుపాం: కురుపాం గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో చలివేంద్రాన్ని గురువారం ఏర్పాటు చేశారు. దీన్ని సర్పంచ్ గార్ల సుజాత, ఉప సర్పంచ్ ఆదిల్, పీఏసీఎస్ అధ్యక్షుడు కొదంగోళ్ల గౌరీశంకరరావు ప్రారంభించారు.

సర్వే రాళ్ల పరిశీలన

భామిని: మండలంలో జరుగుతున్న భూ సర్వే కార్యక్రమాన్ని జిల్లా ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే(ఐఓఎస్) రామకృష్ణ, డీఐఓఎస్ కమలేంద్రప్రసాద్ గురువారం పరిశీలించారు. వడ్డంగి, పక్కుడుబద్ర, బొమ్మికలో జరుగుతున్న కొలత రాళ్ల పాతుడు పనులు పరిశీలించారు. సక్రమంగా సరిహద్దు రాళ్ల వేయాలన్నారు. వారి వెంట తహసీల్దార్ నీలాపు అప్పారావు, మండల సర్వేయరు తోట రామ్మోహనరావు, డీటీ ఎస్.రమేష్‌కుమార్, ఆర్‌ఐ ఎస్.రాంబాబు ఉన్నారు.

108లో ప్రసవం

సీతంపేట: దబర గ్రామానికి చెందిన గర్భిణి గురువారం రాత్రి 108లో ప్రసవమైంది. సవర శాంతమ్మకు పురిటినొప్పులు రావడంతో 108 అంబులెన్స్‌కు కుటుంబ సభ్యులు సమాచారం అందించారు. ఈఎంటీ రమేష్‌బాబు, పైలెట్ రామారావు వెంటనే గ్రామానికి చేరుకుని గర్భిణిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో పురిటినొప్పులు ఎక్కువ కావడంతో ఈఎంటీ అంబులెన్స్‌లో డెలివరీ చేయడంతో పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డను స్థానిక ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు.

నాణ్యమైన విద్య అందించాలి : పీఓ


ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న పీఓ కల్పనాకుమారి

పాలకొండ: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సీతంపేట ఐటీడీఏ పీఓ కల్పనా కుమారి సూచించారు. పట్టణంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలను ఆమె గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. మరింత మెరుగ్గా విద్య అందించాలని తెలిపారు. ఆశ్రమ పాఠశాల పరిసరాలను సక్రమంగా ఉంచాలని ఆదేశించారు. వంట గది సక్రమంగా లేదని వెంటనే శుభ్రం చేయాలని తెలిపారు. అనంతరం అన్నవరం పీహెచ్‌సీని సందర్శించారు. అక్కడ అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆస్పత్రి పరిసరాలు శుభ్రంగా ఉంచాలని సూచించారు.

ప్రభుత్వ కళాశాలల్లో చేరండి

- గ్రామాల్లో అధ్యాపకుల ప్రచారం


కొమరాడలో విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

కొమరాడ: పదో తరగతి పాసయ్యే విద్యార్థులు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలని కోరుతూ ప్రిన్సిపాల్ వై.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కళాశాల అధ్యాపకులు గ్రామాల్లో గురువారం ప్రచారం చేశారు. విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తమ కళాశాలలో చేరితే ప్రభుత్వం కల్పించే సదుపాయాలను పొందవచ్చన్నారు. కళాశాలలో అన్ని మౌలిక సదుపాయాలతో పాటు ప్రభుత్వం విద్యార్థుల కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు కూడా అందుతాయని పేర్కొన్నారు. ఎంపీసీ, బైపీసీతో పాటు ఆర్ట్స్ గ్రూపులు, వృత్తి విద్యా కోర్సులు కూడా ఉన్నాయని తెలిపారు. ప్రచారంలో అధ్యాపకులు సోమేశ్వరరావు, వీరాచారి, శేఖర్, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో ప్రయోజనం


గుణద గ్రామంలో నవధాన్యాల సాగుపై అవగాహన ర్యాలీ

గుమ్మలక్ష్మీపురం: నవధాన్యాల సాగుతో ఎంతో ప్రయోజనమని ఇరిడి ఎంపీటీసీ సభ్యుడు కద్రక మల్లేశ్వరరావు అన్నారు. మండలంలోని దుమ్మంగి పంచాయతీ గుణద గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆర్.పురుషోత్తం, ఎస్.ఢిల్లీశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన నవధాన్యాల సాగుపై గురువారం నిర్వహించిన అవగాహన ర్యాలీలో వారు పాల్గొని మాట్లాడారు. నవధాన్యాల సాగుతో నేల సారవంతమవుతుందని, తద్వారా వేసిన పంటల దిగుబడి పెరుగుతుందన్నారు. నవధాన్యాల సాగుతో ఎంతో ప్రయోజనం కలుగుతుందని ఇరిడి ఎంపీటీసీ సభ్యుడు కద్రక మల్లేశ్వరరావు తెలిపారు. ఈమేరకు మండలంలోని దుమ్మంగి పంచాయతీ గుణద గ్రామంలో గురువారం ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆర్.పురుషోత్తం,ఎస్.ఢిల్లేశ్వరరావుల ఆధ్వర్యంలో నిర్వహించిన నవధాన్యాల సాగుపై అవగాహన ర్యాలీ కార్యక్రమంకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న మల్లేశ్వరరావు రైతులతో మాట్లాడుతూ నవధాన్యాల సాగు వలన నేల సారవంతమౌతుందని, తద్వారా వేసిన పంటల దిగుబడి పెరుగుతుందన్నారు. వ్యవసాయ శాఖ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తెలిపిన సూచనలు పాటించి, ప్రకృతి వ్యవసాయ పద్ధతులను రైతులంతా కొనసాగించాలని సూచించారు.

రక్తహీనత నివారణకు చర్యలు


ఫోలిక్ యాసిడ్ మాత్రలు వేయిస్తున్న డీఐఓ జగన్‌మోహన్‌రావు

గరుగుబిల్లి: విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపి రక్త నివారణ చర్యలు చేపట్టాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డీఐఓ)డా. టి.జగన్‌మోహన్‌రావు సూచించారు. మండలంలోని ఉల్లిబద్ర గ్రామంలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలను ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ తరగతిలో ఉండే పాఠ్యాంశాల మాదిరిగా ఆరోగ్యం పట్ల ప్రతీ విద్యార్థికి అవగాహన అవసరమన్నారు. కాలానుగుణంగా అనారోగ్య లక్షణాలు ప్రబలితే, తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా రక్తహీనతపై అవగాహన కల్పిస్తూ హిమోగ్లోబిన్ 8 శాతం కంటే తక్కువగా ఉంటే తీవ్రమైన రక్తహీనతగా పరిగణిస్తామన్నారు. అనంతరం విద్యార్థులకు వైద్యసిబ్బందిచే ఫోలిక్ యాసిడ్ మాత్రలను వేయించారు. హెచ్‌ఎం అన్నపూర్ణ, జయగౌడ్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలు గ్రహించాలి



విద్యార్థులకు సూచనలిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీవరం

గుమ్మలక్ష్మీపురం: విద్యార్థులంతా బీఆర్ అంబేడ్కర్ ఆశయాలు గ్రహించి, ముందుకు సాగాలని గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీవరం పిలుపునిచ్చారు. కళాశాలలో గురువారం అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులతో మాట్లాడుతూ పరిస్థితులు అనుకూలించకపోయినా.. ఎంతో కష్టపడి వాటన్నింటిని ఎదుర్కొని, ప్రపంచ గుర్తింపు పొందిన గొప్ప వ్యక్తి అంబేడ్కర్ అని కొనియాడారు. ఇంతటి ఖ్యాతి కలిగిన మహనీయుడైన అంబేడ్కర్ జీవితాన్ని అధ్యయనం చేసి, ఆదర్శంగా తీసుకొని ఉన్నత స్థానానికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రామయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

పాతికేళ్ల నిరీక్షణ ఫలించింది

- 1998 అభ్యర్థులకు నియామక పత్రాల అందజేత


వీరఘట్టం: ఎంఈఓ కృష్ణమూర్తి నుండి నియామకపత్రాలు అందుకున్న 1998 బ్యాచ్ ఉపాధ్యాయులు

వీరఘట్టం: పాతికేళ్లుగా ఎదురు చూస్తున్న ఆశల కొలువు తమ దరి చేరడంతో 1998 డీఎస్సీ అభ్యర్థులు ఆనందం వ్యక్తం చేశారు. వారిని ఎంటీఎస్ పద్ధతిలో సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టుల్లో నియమిస్తూ ప్రభుత్వం నియామక పత్రాలు అందజేయడంతో జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో విద్యాశాఖ అధికారులకు ఈ నియామక పత్రాలు అందజేసి 1998 బ్యాచ్ వారు గురువారం విధుల్లో చేరారు. ఉమ్మడి పార్వతీపురం మన్యం జిల్లాలో 493 మంది అర్హత సాధించిన అభ్యర్థులు ఉంటే అందులో ప్రస్తుతం ఉద్యోగం కావాలని 393 మంది ముందుకు వచ్చారు. వీరందరూ ఒప్పంద ప్రాతిపదికన ఉపాధ్యాయులుగా నియమితులయ్యేందుకు వీరిలో కొందరు శ్రీకాకుళం, విజయనగం జిల్లాల్లో కౌన్సెలింగ్‌కు హాజరు కాగా వీరి సొంత మండలాల్లోనే నియామకాలు ఇవ్వడంతో ఎంతో అనందం వ్యక్తం చేస్తున్నారు. గురువారం వీరఘట్టంలో ఎంఈఓ పద్రి కృష్ణమూర్తికి నియామకపత్రాలు చూపించి పలువురు ఉపాధ్యాయులు విధుల్లో చేరారు. ఇలా జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో 1998 అభ్యర్థుల నియామకాలు ప్రభుత్వం చేపట్టడంతో ఆయా కుటుంబాల్లో పండగ వాతావరణ నెలకొంది.

కల నెరవేరింది


పాలకొండ రూరల్: ఎంఈఓతో కొలువు పొందిన 98 డీఎస్సీ క్వాలిఫైడ్ ఉపాధ్యాయులు

పాలకొండ రూరల్: ప్రభుత్వ తోడ్పాటుతో తమ చిరకాల కల నేరవేరిందని 98 డీఎస్సీ క్వాలిఫైడ్ ఉపాధ్యాయులు పేర్కొన్నారు. తాజా ఉత్తర్వులతో పాలకొండ మండలం ఎల్.ఎల్.పురం, గోపాలపురం, పట్టణ పరిధిలో వెంకమ్మపేట ప్రాథమికోన్నత పాఠశాల్లో ముగ్గురికి కొలువు లభించింది. మినిమం టైమ్‌స్కేల్ పేరిట కొలువులు సాధించిన గౌరీశంకర్ శర్మ, కిల్లారి నాగభూషణరావు, రాములు గురువారం విధులకు హాజరయ్యారు. తొలిత వీరు ఎంఈవో మీసాల సూర్యనారాయణను కలసి విధుల్లో చేరేందుకు అవసరమైన ఉత్తర్వులు అందించారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సహకరించిన తీరు మర్చిపోలేమని నూతన ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

గరుగుబిల్లి: 1998 డీఎస్సీ అర్హత సాధించిన ఉపాధ్యాయులకు నియామక పత్రాలను ఎంఈఓ ఎస్.నాగభూషణరావు గురువారం ఎంఆర్‌సీ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తోటపల్లి, ఖడ్గవలస, దత్తివలస, సీమలవానివలస, పెదగుడబ గ్రామాలలోని మండల పరిషత్ పాఠశాలలో నియామకాలు జరిగినట్లు తెలిపారు. విధులను సక్రమంగా నిర్వహించి విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు రామకృష్ణ, యశోద, రాంబాబు పాల్గొన్నారు.


గరుగుబిల్లి: నియామక పత్రాలను అందజేస్తున్న ఎంఈఓ నాగభూషణరావు